క్లుప్తంగా

గెడ్డలుప్పిలో ఆరోగ్య పరీక్షలు

సీతానగరం: గెడ్డలుప్పిలో జ్వరాలు ప్రబలినట్టు ఉన్న సమాచారం మేరకు గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, రామమందిరం వద్ద పలువురికి గురువారం ఆరోగ్య పరీక్షలు వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.ఉషారాణి ఆధ్వర్యంలో గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ యు.సత్యనారాయణ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ముడుపుల పూజలు



ముడుపుల పూజలు అందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామికి భక్తులు గురువారం ముడుపుల పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు ఎదురవకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రైతులకు సహకారం అందిస్తాం..

సీతానగరం: గుచ్చిమి పీఏసీఎస్ ద్వారా రైతులకు, వాణిజ్య వేత్తలకు తమవంతు సహకారాన్ని అందిస్తామని పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిరంజీవి అన్నారు. మండలంలోని గుచ్చిమి పీఏసీఎస్ చైర్మన్, ఇద్దరు డైరక్టర్లుగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు చిరంజీవి మాట్లాడుతూ ఎమ్మెల్యే బి.విజయచంద్ర నాయకత్వంలో పార్టీ కోసం సేవలందించిన వారికి గుర్తింపు వస్తుందన్నారు. గుచ్చిమి పీఏసీఎస్ ద్వారా గుచ్చిమి, సీతారాంపురం, జోగింపేట గ్రామాల వర్తకులకు, రైతులకు సేవలందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవోలు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆశ' సమస్యల పరిష్కార వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురంటౌన్: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కార వేదికను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఎన్జీఓ హోంలో గురువారం నిర్వహించిన ఆశా గ్రీవెన్స్‌కు ప్రతీ పీహెచ్‌సీ నుంచి ఒక ఆశా కార్యకర్త ప్రతినిధిగా హాజరయ్యారు. వారి సమస్యలను గ్రీవెన్స్‌లో ప్రస్తావించి ఫిర్యాదులను డీఎంహెచ్‌వోకు అందజేశారు. వీటిలో ప్రధానంగా వారి విధి విధానాలకు సంబంధించి ఆశ జాబ్ చార్ట్ మేరకు విధులు అమలయ్యేలా ఉండాలని నివేదించారు. గ్రీవెన్స్‌లో అందజేసిన ఫిర్యాదులను పరిశీలించి తగు పరిష్కారం చూపుతామని డీఎంహెచ్‌వో వారికి తెలియజేశారు. ప్రతీ ఆశా కార్యకర్తకు గుర్తింపు కార్డు ఉండేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లా ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు, ఎపిడిమాలజిస్టు డా.కౌశిక్, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, డీసీఎం విజయలత, హెచ్ఈ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులు, మందుల దుకాణాల తనిఖీ



ప్రైవేట్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న మండల అధికారుల బృందం

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రులు, మందుల దుకాణాలను డిప్యూటీ తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, పోలీసుల ఆధ్వర్యంలో వైద్యాధికారి పి.ఉషారాణి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సేవలు అందించేందుకు కనీస పరిజ్ఞానం ఉండాలని, ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాలని, ఫార్మసిస్టు పర్యవేక్షణలో మెడికల్ షాపుల్లో వైద్యులు సిఫార్సు మేరకు మందులు విక్రయించాల్సి ఉందన్నారు. ఇలా చేయకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టు లేకుండా మందులు విక్రయిస్తున్నట్టు తెలిసిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అనుమతి లేకుండా క్లినిక్‌లు ఏర్పాటు చేసి పొంతన లేని మందులను రాయడం సరి కాదన్నారు. ప్రైవేటు మెడికల్ ప్రాక్టిషనర్లు నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తే వారిని గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వారంలోగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలోనే గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న నాటు వైద్యుల వివరాలను గుర్తించి వారికి హెచ్చరికలు జారీ చేస్తామన్నారు. వారి వెంట సీహెచ్‌వో ఎస్‌వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

మోసానికి కేరాఫ్ చంద్రబాబు

- సంక్షేమానికి చిరునామా వైఎస్ జగన్
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



తాళ్లబురిడిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో గడప గడపకు వెళ్లి ఇంటింటికి వంచన కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: సంక్షేమమంటే రాష్ట్రంలో ప్రజలకు గుర్తొచ్చేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, అలాగే పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని, అలాగే ప్రజలను మోసం చేసే నాయకులు ఎవరైనా ఉన్నారంటే రాష్ట్ర ప్రజలకు గుర్తొచ్చేది చంద్రబాబేనని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ధ్వజమెత్తారు. గురువారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ ఇంటింటికి వంచన కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడిలో మండల నాయకులతో కలసి ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పలు వీధుల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న కార్యకర్తలు, నాయకులతో కలసి ర్యాలీ నిర్వహించి అనంతరం గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేయని హామీలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జోగారావు మాట్లాడుతూ త్రికరణ శుద్ధితో ప్రమాణం చేసి మరీ రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి ప్రజలను కూటమి నేతలు మోసం చేశారని ధ్వజమెత్తారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశానుసారం పార్టీ ప్రధాన ఆలోచన మేరకు అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా పక్షంలోనే తాము ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ బి రవికుమార్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మువ్వల సత్యం నాయుడు, స్థానిక గ్రామ సర్పంచ్ చప్ప రామకృష్ణ, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు మడక విశ్వనాథం, యాండ్రాపూ తిరుపతిరావు, బంకపల్లి వాసుదేవరావు, చందాన శివాజీ, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు బలగ నాగేశ్వరరావు, ఎస్.వెంకటరమణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు యాళ్ళ ప్రతాప్, గండి శంకరరావు, పెంద రమణ, బడే శ్రీరంజన్, గొర్లి రాజు, ఎంపీటీసీ సభ్యులు ఎగిరెడ్డి రమణ, మర్రాపు వాసుదేవరావు, తాడూరు సోములమ్మ, మండల పార్టీ ప్రజా ప్రతినిదులు మజ్జి శేఖర్, చింతల ప్రసాద్, తోడబండి రవికుమార్, మహాపాత్రో గణేష్, భూతాల వెంకటరమణ, టి. రామస్వామి, ఉరిటి అప్పలనాయుడు, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణంలో 19వ వార్డులో.....

పార్వతీపురం మున్సిపాలిటీలో గల 19వ వార్డు వైఎం కాలనీలో పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వంచనను వివరించి ఇంటింటికీ వంచన కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, స్థానిక కౌన్సిలర్ తెలుగు బోదయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్లి మాధవరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సువ్వాడ లావణ్య, చీకటి అనూరాధ, వి నేతాజీ, జి గాయత్రి దేవులపల్లి నాగరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రెడ్డి రవి, బోను ఆదినారాయణ, బి శ్రీనివాసరావు, డి గురుమూర్తి, గంగరాజు, బడే గౌరీ నాయుడు, గర్బాపు శోబన్‌బాబు, పోలినాయుడు , జవ్వాది వజ్రం, పైల కిరణ్, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ



బాబు మోసాలపై ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సీతానగరం: మండలంలోని రంగంపేటలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్టీ ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, సర్పంచ్ పద్మావతి, శివున్నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కూటమి నేతలను సూపర్ సిక్స్ పథకాల అమలుపై నిలదీయాలన్నారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.శంకరరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు ఆర్వీ పార్థసారధి, బి తిరుపతిరావు, కె శ్రీనివాసరావు, వై.వెంకటనాయుడు, వై.జగన్నాథం, దొగ్గ సుధ, వై.గోపాల్, ఎంపీటీసీలు అక్కపోలు సింహాచలం, వై.వెంకటరమణ, ఫాస్టరు రాము, వేణు, వై.పారినాయుడు, శివున్నాయుడు పాల్గొన్నారు.



పట్టణంలోని 19వ వార్డులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు

అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబును మించిపోతున్న మంత్రి సంధ్యారాణి

- ప్రశ్నిస్తారనే... ఇంటింటికి వెళ్లలేకపోతున్నారు..
- ఇచ్చిన హామీలు ఎగ్గొట్టారు..
- 50 ఏళ్లకే పింఛన్ ఎప్పుడిస్తారో కూటమి నేతలు చెప్పాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



పట్టణంలోని 7, 8 వార్డుల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు రూరల్: అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబునాయుడును గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మించిపోతున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలోని 7, 8 వార్డుల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సంధ్యారాణి సమావేశాల్లో 80 శాతం పథకాలు అమలు చేసేసామని ప్రచారం చేసుకుంటున్న తీరు చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. 50 ఏళ్లు దాటిన దళితులకు ఎప్పుడు పెన్షన్ ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతకాలు చేసిన కరపత్రాలు ఇంటింటికి పంచారని అందులో పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలపై ప్రజలు ప్రశ్నిస్తారనే మంత్రి సంధ్యారాణి ఇంటింటికి వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రజలు కాలర్ పట్టుకుని ప్రశ్నించే రోజులు ఎవరికి దగ్గర పడుతుందో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు.

మహిళలకు రూ.1500 ఎప్పుడు ఇస్తారు..

మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ ఎప్పుడు ఇస్తారో మంత్రి సంధ్యారాణి స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందోనని వేచి చూస్తున్నారని యువతను మోసం చేస్తే భవిష్యత్ తరాలపై ఆ ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గొర్లె జగన్‌మోహనరావు, గిరి రఘు, మాజీ కౌన్సిలర్ పిరిడి రామకృష్ణ 7, 8 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్యే విజయచంద్ర ఎన్‌సీఎల్‌టీ టీం ఆర్‌పీ కె.శివలింగం, మాధవప్రసాద్, అలోక్‌షాప్రలను గురువారం కలిశారు. ఫ్యాక్టరీ ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కర్మాగారం మూసేయడం వల్ల కార్మిక కుటుంబాల పరిస్థితిపై చర్చించారు. కార్మికులకు జీతాలు చెల్లించాలని ఎమ్మెల్యే కోరారు.

'భోజనం'కు నిధులు పెంచాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు, యూనియన్ సభ్యులు

సాలూరు: కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు జీతాలు పెంచి మెస్ చార్జీలు పెంచేలా నిధులు కేటాయించి బలోపేతం చేయాలని నిర్వాహకుల యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ నాయకురాళ్లు సుశీల, లక్ష్మి అధ్యక్షతన లయన్స్ క్లబ్ పాఠశాల వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీను మాట్లాడుతూ, తక్కువ జీతాలకు పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం వెంటనే కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి చెల్లించాలన్నారు. అన్ని పాఠశాలలకు వంట గదులు, పని ముట్లు, వర్కర్లకు యూనిఫాం సరఫరాకు ప్రభుత్వమే నిధులు కేటాయించాలని అన్నారు. సెప్టెంబరు 13, 14 తేదీలలో సీఐటీయూ మహాసభలు పాలకొండలో జరగనున్నాయని తెలిపారు. దీనికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకురాళ్లు శ్రీదేవి, తవిటమ్మ, పుష్పలత, శోభ, నిర్మల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అందించిన సేవలు పదిలం



ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో సేవలందించి పదవీ విరమణ పొందిన అధికారులు అందించిన సేవలు పదిలంగా ఉంటాయని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి అన్నారు. గురువారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఐలు గంగిట్ల వెంకటరమణ, యమ్మల సురేష్, ఏఆర్ ఎస్ఐ ఎం.మల్లేశ్వరరావులను ఆయన కార్యాలయంలో గురువారం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. నిర్వహణలో క్రమశిక్షణతో ఎక్కడా రాజీపడకుండా నిర్వర్తించారని అభినందించారు. ఒత్తిడితో కూడుకున్న పోలీసు ఉద్యోగంలో ప్రజలకు నేరుగా సేవలు అందించడం గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, ఏవో సతీష్, సూపరింటెండెంట్‌లు శ్రీనివాసరావు, శంకరరావు, సిబ్బంది, ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు..



నూకలవాడలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బలిజిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దని జెడ్పీటీసీ రవికుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాలతో సర్పంచ్ కె.ఝాన్సీ ఆధ్వర్యంలో నూకలవాడలో గురువారం చంద్రబాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అని గద్దెనెక్కి తరువాత ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని చంద్రబాబును నమ్మొద్దని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిఎస్ఆర్.నాయుడు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి టి.ప్రసాదరావు, పార్టీ జిల్లా ఆర్గనైజేషనల్ కార్యదర్శి కె.మోహనరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జి.పకీరునాయుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏసు, మండల వీవర్స్ అధ్యక్షులు నారాయణరావు, కె.వెంకటరమణ, ఎస్.తవిటి నాయుడు, జి.కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి



ఎరువుల దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న ఏవో

పార్వతీపురం రూరల్: ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయించే దుకాణ యజమానులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి తమ వ్యాపారాలు చేయకపోతే వారి లైసెన్సులను రద్దు చేసి దుకాణాలను సీజ్ చేయడం జరుగుతుందని పార్వతీపురం మండల వ్యవసాయశాఖ అధికారి అశోక్ వ్యాపారులను హెచ్చరించారు. ఈ మేరకు గురువారం స్థానిక మార్కెట్ యార్డులో ఏడీఏ కార్యాలయంలో ఎరువుల దుకాణదారుల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాలను అనువుగా తీసుకొని అధిక ధరలకు విక్రయించినా.. నిబంధనలు పాటించకపోయినా.. ప్రభుత్వ పరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు చేసి స్పష్టంగా స్టాక్ రిజిస్టర్, విక్రయిస్తున్న బిల్లులు, బహిరంగ ధరల పట్టిక ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. ప్రతీ డీలర్ తమ వద్ద వున్న ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు కార్యాలయానికి నివేదిక పంపించాలన్నారు.

త్వరలో గ్రామ, వార్డు కమిటీల నియామకం

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావును మర్యాదపూర్వకంగా కలసిన జిల్లా అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ వీరరెడ్డి

పార్వతీపురం రూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జిల్లా, మండల స్థాయి అనుబంధ విభాగాల కమిటీల నియామకం పూర్తయ్యిందని, త్వరలో గ్రామ, వార్డు స్థాయి కమిటీల నియామకాలను పూర్తి చేస్తామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో జిల్లా అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ వీరరెడ్డి జోగారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారిద్దరు అనుబంధ విభాగాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ రాబోయే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలకే పెద్దపీట వేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించి ప్రభుత్వం ప్రజలకు అందించే సేవల్లో భాగస్వామ్యం చేసేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆలోచనతో ఉన్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ విభాగ జాయింట్ సెక్రటరీగా రామారావు



మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో సరిత రామారావు

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఐటీ విభాగ కమిటీలో వివిధ హోదాల్లో పలువురిని నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్వతీపురం నియోజకవర్గం బలిజిపేట మండలానికి చెందిన సరిత రామారావును రాష్ట్ర ఐటీ విభాగ జాయింట్ సెక్రటరీగా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు తనకు ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు రామారావు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిరాశ్రయుల వసతిగృహంపై రాజకీయాలా..?



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ దాలినాయుడు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని నిరాశ్రయుల గృహ నిర్వహణపై పాలకులు రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ వంగల దాలినాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి ఆశ్రయం లేని అభాగ్యులకు ఆశ్రయమిచ్చే నిరాశ్రయుల వసతిగృహం నిర్వాహకుల నియామకం గత కొంతకాలంగా నాయకుల మధ్య నలిగిపోవటం బాధాకరమన్నారు. మున్సిపాలిటీ పాలకవర్గంలో పాలకులు అభాగ్యులకు ఆశ్రయంపై తమ ప్రతాపం చూపటం సరికాదన్నారు. గత కొంతకాలంగా కౌన్సిల్‌లో ఈ విషయం ప్రస్తావనకు రావటం, ఒక కొలిక్కి రాకపోవడం ఇరు వర్గాల తప్పిదమేనని ఆరోపించారు. వారి పట్టుదలతో కొంతకాలంగా నిర్వాహకుల లేక వసతిగృహం నిర్వహణ లేక అనాధగా మిగలడం బాధాకరమన్నారు. ఈ విషయం కలెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ దష్టికి వెళ్లినప్పటికీ తగు చర్యలు లేకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు దృష్టి సారించి దీన్ని అనుభవం ఉన్నటువంటి వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఆయనతో పార్టీ మండల అధ్యక్షులు గౌరీ శంకరరావు, జిల్లా నాయకులు కోలా కిరణ్ కుమార్, పాలక రంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.

సెప్టెంబర్ 13, 14 తేదీల్లో సీఐటీయూ మహాసభలు

పార్వతీపురం టౌన్:



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో జరగనున్న సీఐటీయూ 11వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరవమ్మ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో గురువారం జరిగిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో మహాసభల విరాళ కరపత్రాన్ని జిల్లా కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షణకు, ప్రభుత్వ సంస్థలలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలపై కార్మికుల పక్షాన నికరంగా నిలబడి ఉద్యమాలను నడుపుతున్న సంఘం సీఐటీయూ అని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మోటారు, భవన నిర్మాణం, రైస్ మిల్లు, ముఠా కళాసీలు తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై నికరంగా సీఐటీయూ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన అధ్యక్ష కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వి.రమణ, ఎన్.వై.నాయుడు, ఎ.శాంతి, జి.జ్యోతి, వి.రామలక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com